'గృహలక్ష్మి' కోసం

దరఖాస్తు స్వీకరణ షురూ...
- ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు
- స్పష్టత లేక గందరగోళంలో అర్హులు

శంకర్‌పల్లి: సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించు కోలేని వారి సొంతగూటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా పథకం ద్వారా ఇళ్లు నిర్మించుకునే పేద వారికి రూ. 3 లక్షలు ఆర్థిక సహాయం చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. దీంతో అర్హులు కుల, ఆదాయ ధ్రువీకరణ కరపత్రాల కోసం తహసీల్దార్, మీసేవ కేంద్రాల వద్ద భారులు తీరారు. పథకం కోసం ఎప్పటి వరకు దరఖాస్తు చేసుకోవాలనే దానిపై స్పష్టత లేకపోవడంతో లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు. గృహలక్ష్మి పథకం ధరఖాస్తు విషయంలో ప్రభుత్వం వివరణ ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

దరఖాస్తుల స్వీకరణ

కేశంపేట: తహసీల్దార్ కార్యాలయంలో గృహలక్ష్మి దరఖాస్తులను స్వీకరించేందుకు జూనియర్ అసిస్టెంట్ సరస్వతిని తహసీల్దార్ ఆజాం అలీని నియమించారు. కులం, ఆదాయం సర్టిఫికెట్లు లేకున్నా దరఖాస్తులను తీసుకుంటున్నామని తహసీల్దార్ తెలిపారు. దరఖాస్తులను తెల్లకాగితంపై వివరాలు నమోదు చేసి ఇచ్చినా స్వీకరిస్తామని తెలిపారు. కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు జిరాక్స్ సెంటర్ల వద్ద ఉదయం నుంచి బారులుతీరారు.


శంకర్‌పల్లి మీసేవా కేంద్రం వద్ద ధరఖాస్తులు అందిస్తున్న అర్హులు

గందరగోళం

చేవెళ్ల: గృహలక్ష్మి పథకం దరఖాస్తుల విషయంలో గందరగోళం నెలకొంది. అర్హులకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల కాకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ పథకానికి అర్హులైన మహిళలు దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారే.. ఎక్కడ దరఖాస్తులు చేసుకోవాలి.. ఎవరికీ దరఖాస్తులు అందజేయాలనే దానిపై ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలను జారీ చేయలేదని వాపోతున్నారు. మండలంలోని మీ–సేవ కేంద్రంలో అడిగితే తమకు ఎలాంటి ఆదేశాలు లేవని ఆన్‌లైన్‌లో స్వీకరించటం లేదని సిబ్బంది చెబుతున్నారు. ఎంపీడీఓ హిమబిందును, తహసీల్దార్ కార్యాలయంలో అధికారులను అడిగితే తమకు ఎలాంటి ఆదేశాలు లేవని, అందువల్ల దరఖాస్తులు స్వీకరించటం లేదన్నారు. దీంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.


కేశంపేట: దరఖాస్తులు స్వీకరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస్ సర్కారే

- పేదల అభ్యున్నతికి సీఎం కృషి
- బీఆర్‌ఎస్ పార్టీకి అండగా ఉండండి
- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

షాబాద్: ముచ్చటగా మూడోసారి బీఆర్‌ఎస్ సర్కార్ అధికారంలోకి వస్తుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ధీమా వ్యక్తం చేశారు. బుధవారం షాబాద్, కేశవగూడ గ్రామాల్లో గొల్లకురుమలకు షాబాద్ జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి, ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డిలతో కలిసి గొర్రెల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నారని తెలిపారు. కులవృత్తుల అభ్యున్నతికి ప్రభుత్వం ఎంతో చేస్తోందని, నిరుపేదల అభ్యున్నతికి దోహదపడుతోందని తెలిపారు. రాబోయే రోజుల్లో మరెన్నో పథకాల ద్వారా నిరుపేదలను ధనవంతులుగా చేసేందుకు సీఎం ఎంతో శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. అందువల్ల బీఆర్‌ఎస్ పార్టీకి అండగా ఉండాలన్నారు. ప్రతి కార్యకర్త ప్రజలకు అందుబాటులో ఉండాలని, ఎలాంటి అవసరాలు వచ్చినా ప్రజాప్రతినిధులు వారిని ఆదుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ శేఖర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్, తెలంగాణ రాష్ట్ర లీగల్ సెల్ నాయకులు సతీష్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు రాజేందర్‌గౌడ్, షాబాద్ మాజీ సర్పంచ్ వెంకట్‌యాదవ్, కేశవగూడ సర్పంచ్ కవిత, నాయకులు మల్లయ్య, రామకృష్ణ, పశువైద్యాధికారి స్రవంతి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ, నాయకులు తదితరులున్నారు.


షాబాద్‌లో గొర్రెలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

క్లుప్తంగా

నేడు కాంగ్రెస్ ముఖ్య నేతల సమావేశం

చేవెళ్ల: నేడు చేవెళ్లలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గం సమన్వయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, నియోజకవర్గం నాయకులు వసంతం తెలిపారు. చేవెళ్లలోని కేజీఆర్ గార్డెన్‌లో గురువారం ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు. నియోజకవర్గంలోని చేవెళ్ల, శంకర్‌పల్లి, నవాబుపేట, మొయినాబాద్, షాబాద్ మండలాలకు చెందిన ముఖ్య నాయకులు సమావేశంలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి మున్సూర్ అలీఖాన్, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే కెఎల్ఆర్, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహ్మారెడ్డి తదితరులు హాజరవుతున్నారని తెలిపారు.

రైతుల పంట వివరాల నమోదు చేసుకోండి

ఏఈఓ రామకృష్ణారెడ్డి


మోకిలలో పంట వివరాలను నమోదు చేస్తున్న ఏఈఓ రామకృష్ణారెడ్డి

శంకర్‌పల్లి: రైతులు సాగు చేస్తున్న పంట వివరాలను నమోదు చేసుకోవాలని మోకిల క్లస్టర్ ఏఈఓ రామకృష్ణారెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని మోకిల గ్రామంలో రైతులు సాగుచేస్తున్న పంట వివరాలను నమోదు చేశారు. రైతులు ఏ సర్వే నంబర్‌లో ఎలాంటి పంటలు వేశారో.. తప్పని సరిగా వ్యవసాయశాఖ రికార్డుల్లో నమోదు చేసుకోవాలని తెలిపారు. మొక్కజొన్న, వరి పంటల్లో దిగుబడికి పలు సూచనలు, సలహాలను అందించారు. వ్యవసాయ అధికారుల సలహాలు పాటిస్తే అధిక దిగుబడిని పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు మోహన్‌రెడ్డి, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

కేసీఆర్ మాట నిలబెట్టుకోవాలి

అరెకటిక సంఘం జిల్లా ఉపాధ్యాక్షుడు శివాజీ



కేశంపేట: ఉద్యమ సమయంలో ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే అరెకటికలకు ఎస్సీ రిజర్వేషన్ కల్పిస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని, రాష్ట్రం ఏర్పడిన తరువాత అరెకటికలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శివాజీ విమర్శించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలను అందిస్తామన్నారని, నేటికి ఈ హామీ అమలు కాలేదని తెలిపారు. అరెకటికలకు ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేకుంటే వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.

సంస్కృతి, సంప్రదాయలను కాపాడుకోవాలి

చేవెళ్ల: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవాటు చేసుకోవాలని బీజేపీ మండలపార్టీ ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి సూచించారు. చేవెళ్ల మండలంలోని జాలగూడ గ్రామంలో నిర్మిస్తున్న హనుమాన్ ఆలయానికి బుధవారం ఆయన రూ. 51వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉండే ఆలయాలు ప్రజల్లో దైవచింతనకు ఉపయోగపడుతాయని చెప్పారు. మన దేశ సంస్కృతి సంప్రదాయలను కాపాడుకోవాలని చెప్పారు. జాలగూడ గ్రామస్తులు హనుమాన్ ఆలయ అభివృద్ధికి ముందుకు రావటం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో జాలగూడ గ్రామానికి చెందిన ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

షాబాద్: ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని దామర్లపల్లి గ్రామ సర్పంచ్ లింగం అన్నారు. బుధవారం నాన్‌ందార్ఖాన్‌పేట్ గ్రామంలో చేవెళ్లకు చెందిన పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాల వైద్యులు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ప్రజలకు ఉచితంగా వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ లింగం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సిబ్బంది, గ్రామస్తులు తదితరులున్నారు.

క్విట్ ఇండియా స్ఫూర్తితో వంటావార్పు

బొంరాస్‌పేట: కాంటాక్టు పద్ధతిన ఆరోగ్య వైద్య సేవలు అందిస్తున్న ఎంపీహెచ్‌ఎస్(ఏఎన్‌ఎం)లు క్విట్ ఇండియా స్ఫూర్తితో వంటావార్పు కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఎంలు లీలావతి, హైమావతి మాట్లాడుతూ.. వేతనాలకు మించి సేవలు చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త ఉద్యోగాలు తీసుకుంటున్న నేపథ్యంలో ప్రస్తుతం పనిచేస్తున్న కాంట్రాక్టు ఏఎన్‌ఎంలను పర్మినెంట్ చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రకటించాలన్నారు.

పాడి పరిశ్రమతో అధిక లాభాలు


షాబాద్: పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి


మొయినాబాద్ మండలం చందానగర్‌లో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

షాబాద్: పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం షాబాద్ మండల పరిధిలోని సోలిపేట్ గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో పశువులకు టీకాలు వేయించుకోవాలని సూచించారు. వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమను రైతులు అభివృద్ధి చేసుకుంటే అధిక లాభాలు వస్తాయన్నారు. పశువుల ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకుని పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది తదితరులున్నారు.

మొయినాబాద్‌లో..

మొయినాబాద్: పశువులకు రోగాలు రాకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని మండల పశు వైద్యాధికారి దేవిరెడ్డి అన్నారు. మండలంలోని చందానగర్‌లో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో 101 పశువులకు నట్టల నివారణ మందులు, గాలికుంటు వ్యాధి నివారణ, చర్మవ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో పశువులకు రోగాలు వచ్చే అవకాశం ఉంటుందని, ముదస్తుగా టీ కాలు, మందులు వేయించాలన్నారు. గ్రామాల్లో ఉచితంగా టీకాలు, మందులు వేస్తున్నామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకో వాలని సూచించారు.

ఓటు వినియోగంపై అవగాహన

కొందుర్గు: ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కును వినియోగించుకోవడం పౌరుని బాధ్యత అని ఎంఆర్ఐ మహేందర్ గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని టేకులపల్లి, రేగడిచిల్కమర్రి గ్రామాల్లో ఈవీఎంల ద్వారా ఓటు హక్కు వినియోగంపై ఆయా గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించారు. స్వేచ్ఛయుత వాతావరణంలో ఓటరు తమకు నచ్చిన నాయకుడికి ఓటు వేయవచ్చని అన్నారు. ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్లను పెంచండి

తాండూరు టౌన్: పట్టణంలో ఆధార్ సెంటర్లను పెంచాలని బుధవారం పలువురు బీఎస్పీ నాయకులు మున్సిపల్ చైర్ పర్సన్ స్వప్నకు వినతిపత్రం అందజేశారు. పలు సంక్షేమ పథకాల దరఖాస్తుతో పాటు, ఓటర్ ఐడి కార్డుకు ఆధార్‌కార్డు అనుసంధానం చేయడం వంటి అంశాలకు ఆధార్‌కార్డు తప్పనిసరి అయిందన్నారు. అయితే, పట్టణంలో ఒకే ఒక ఆధార్ సెంటర్ ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ అసెంబ్లీ ఇన్‌చార్జి సత్యమూర్తి, నియోజకవర్గ అధ్యక్షుడు అరుణ్‌రాజ్, రమేష్, జైరామ్, ముత్యాలు తదితరులు ఉన్నారు.

కార్మికులకు న్యాయం చేయాలి

కాంగ్రెస్ నేత సుధాకర్ రెడ్డి

వికారాబాద్ అర్బన్: మున్సిపల్ కార్మికులు, ఆశవర్కర్లకు పనికి తగిన వేతనం ఇచ్చి, ప్రభుత్వ ఉద్యోగులగా గుర్తించాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అర్థ సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, ఆశవర్కర్లు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద 48 గంటల తలపెట్టిన రిలే నిరహార దీక్షకు బుధవారం ఆయన మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలను మానుకొని కార్మికులు, ఆశవర్కర్లకు న్యాయం చేయాలన్నారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితి మున్సిపల్ కార్మికులు, ఆశవర్కర్లు, హెల్త్ వర్కర్స్ చేసిన సేవ మరువలేనిదన్నారు. అలాంటి వారిని ప్రభుత్వం పర్మినెంట్ చేయడంలో కాలయాపన చేయడం తగదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సత్యనారాయణ, నాయకులు రత్నారెడ్డి, అనంత్ రెడ్డి, కౌన్సిలర్లు వేణుగోపాల్ రెడ్డి, మురళి పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

మొయినాబాద్ రూరల్: ప్రజలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకున్నప్పుడే రోగాలు దరి చేరవని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ పాండుగౌడ్, నక్కలపల్లి సర్పంచ్ స్వప్న అన్నారు. బుధవారం నక్కలపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు పరీక్షలు నిర్వహించి, మందులు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలకు బీపీ, షుగర్ లాంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నారని తెలిపారు. ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలు ఎంతో ఆరోగ్యంగా ఉండే వారని, ఇప్పుడు కొత్త కొత్త రోగాలు పీడిస్తున్నాయని తెలిపారు. వాటిని అధిగమించేందుకు వైద్యుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ అనురాగ్, ఫాతిమా, ఆశావర్కర్ యాదమ్మ, వీవో శిరీషా, పంచాయతీ కార్యదర్శి ప్రియాంక, కారోబార్ నరేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.


ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

- టీపీసీసీ సభ్యుడు కేఎల్ఆర్
- కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు

చేవెళ్ల: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకునేందుకు అంతా కలిసి పనిచేయాలని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ సభ్యుడు కేఎల్ఆర్ పిలుపునిచ్చారు. కేఎల్ఆర్ సమక్షంలో బుధవారం చేవెళ్ల గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ మాజీ వార్డు మెంబర్లు, నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ రోజురోజుకు బలపడుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. పార్టీకోసం కష్టపడి పనిచేసే నాయకులు, కార్యకర్తలకు పార్టీలో తగిన గుర్తింపు వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అధికార ప్రతినిధి గౌరీ సతీష్, నియోజకవర్గం సమన్వయ కమిటీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, నాయకులు షాబాద్ దర్శన్, డీసీసీ నాయకులు మధుసుధన్ గుప్తా, శ్రీనివాస్, బుచ్చిరెడ్డి, వీరేందర్‌రెడ్డి, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


కేఎల్ఆర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

జీపీ కార్మికుల సమ్మె విరమణ


ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సమావేశమైన జీపీ కార్మికులు

- హర్షం వ్యక్తం చేసిన కార్మికులు
- నేటి నుంచి విధుల్లోకి

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుదన్న నమ్మకంతో పంచాయతీ కార్మికులు సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ సులోచనకు విరమణ పత్రాన్ని కార్మికులు అందజేశారు. మండలంలో 28 గ్రామ పంచాయతీల్లో దాదాపు 250 మంది కార్మికులు 35 రోజుల పాటు సమ్మెలో పాల్గొన్నారు. సమ్మె విరమణతో ఆయా గ్రామాల పంచాయతీ కార్మికులందరూ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మండల సీఐటీయూ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ కార్మికులు నేటి నుంచి విధుల్లో చేరుతారని తెలిపారు. మంత్రి ఎర్రబెల్లికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రత్నం, సుధాకర్, కృష్ణ, సుజాత, భారతమ్మ, నర్సింహులు, పాండు, లలిత తదితరులు పాల్గొన్నారు.

ఈ ఘనత కేసీఆర్‌దే

జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి

షాబాద్: గ్రామాల అభివృద్ధికి టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని షాబాద్ జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని చిన్న సోలీపేట్ గ్రామంలో రూ. 20 లక్షల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు సర్పంచ్ రమ్యకృష్ణ, ఎంపీటీసీ లతతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కావలి గోపాల్, మాజీ ఎంపీటీసీ శంకర్, నాయకులు రాంచంద్రారెడ్డి, మహిపాల్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, తదితరులున్నారు.


షాబాద్: సోలీపేట్ గ్రామంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న అవినాశ్‌రెడ్డి తదితరులు

నవీన్‌కుమార్‌రెడ్డిని పరామర్శించిన అవినాశ్‌రెడ్డి

షాబాద్: నిమ్స్‌లో చికిత్స పొందుతున్న నవీన్‌కుమార్‌రెడ్డిని బుధవారం షాబాద్ జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి పరామర్శించారు. మన్‌మర్రి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి కుమారుడు నవీన్‌కుమార్‌రెడ్డి కొద్దిరోజులుగా గుండె సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నారు. వారం రోజులుగా ఆయన నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న అవినాశ్‌రెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యంఅందించాలని వైద్యులను కోరారు.

అమర వీరులను స్మరించుకుందాం

కొందుర్గు: దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన అమరవీరులను స్మరించుకోవాలని నెహ్రూ యువకేంద్ర సంఘటన్ రాష్ట్ర డైరెక్టర్ విజయ రావు సూచించారు. ఆజాద్ కా అమృత్ మహోత్సవ్ వజ్రోత్సవ వేడుకల కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం వనంపల్లి క్రీడా మైదానంలో 75 మొక్కలను నాటారు. ఈ సందర్భంగా పంచప్రాన్ ప్రతిజ్ఞ చేశారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. అనంతరం విజయ రావు మాట్లాడుతూ దేశాభివృద్ధికి యువత తోడ్పడాలని సూచించారు. అమరవీరులను ఆదర్శంగా తీసుకొని దేశసేవలో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి ఐజయ్య, అసిస్టెంట్ డైరెక్టర్ రాజేశ్, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీఓ మహేశ్‌బాబు, ఏపీఎం రామస్వామి, సర్పంచ్ కవిత పాల్గొన్నారు.


పంచప్రాన్ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

సంతలో సౌకర్యాలేవి ?

జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం

కేశంపేట: గొర్రెలు, మేకల సంతలో నిర్వాహకులు సౌకర్యాలు కల్పించాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం (జీఎంపీఎస్) జిల్లా అధ్యక్షుడు గౌరి శ్రీశైలం అన్నారు. సంతలో సౌకర్యాలపైన జీఎంపీఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం మండల కేంద్రంలోని సంతను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం మాట్లాడుతూ... గ్రామ పంచాయతీ అధ్వర్యంలో సంతను నిర్వహిస్తున్నారని అన్నారు. సంత నిర్వహణకు గ్రామ పంచాయతీ సంవత్సర కాలానికి టెండర్ కూడా వేసిందని దీంతో భారీగా ఆదాయం వచ్చినా సౌకర్యాలు కల్పించడంలో విఫలం అయ్యిందని అయన అన్నారు. గ్రామ పంచాయతీవారు ఇప్పటికైనా సంతలో జీవాలకు నీటి సౌకర్యం, రైతులకు విశ్రాంతి భవనం నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే సంతకు స్థలం కేటాయించడంతో పాటు మరుగుదొడ్లను నిర్మించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మల్లేశ్, పెంటయ్య, చిన్న మల్లయ్య, తిరుపతయ్య, గోపాల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


సంతలో సమస్యలపై మాట్లాడుతున్న నాయకులు

గ్రామాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

నందిగామ: నియోజవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. మండలంలోని చర్ల అంతిరెడ్డిగూడ, వెంకమ్మగూడ, చేగూరు, బంజోనిగూడ, బుగ్గోనిగూడ, నర్సప్పగూడ గ్రామాల్లో ఎమ్మెల్యే బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రతి వీధి తిరుగుతూ సమస్యలను అడిగితెలుసుకున్నారు. గత ప్రభుత్వాలు గ్రామాలను ఏ మాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల రూపు రేఖలు మారిపోయాయని అన్నారు. ప్రతి గ్రామానికి ఒక ట్రాక్టర్, పల్లె ప్రకృతి వనాలు, స్మశాన వాటికలు, డంపింగ్ యార్డుల నిర్మాణం, హరితహారం కార్యక్రమం ద్వారా పల్లెలను ఆకుపచ్చ గ్రామాలుగా తీర్చిదిద్దామని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ గణేశ్, ఎంపీపీ ప్రియాంక, పీఏసీఎస్ చైర్మన్ అశోక్, సర్పంచులు రజనీత, కుమార్, అశోక్, నీలమ్మ, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షురాలు లత, మాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


చేగూరులో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ఆదరణ

కొత్తూరు: ప్రజల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి రోజురోజుకు ఆదరణ పెరుగుతోందని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తెలిపారు. ఓర్వలేక ప్రతిపక్షాలు ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. పల్లెబాటలో భాగంగా బుధవారం ఆయన మండలంలోని తీగాపూర్ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలకు నీటి కష్టాలు లేకుండా ప్రతి ఇంటికి మిషన్ భగీరథ పథకం ద్వార నీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో అంతర్గత రోడ్లను సీసీ రోడ్లుగా మార్చిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఉనికిని కోల్పోతున్న చెరువులు, కుంటలకు మిషన్‌కాకతీయ పథకంలో భాగంగా మరమ్మతులు చేపట్టి భూగర్భ జలాలను పెంచేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, రమేశ్, కృష్ణ, బీఆర్‌ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.